ఈనాడు రాజన్న సిరిసిల్ల

ఆదివారం సెప్టెంబరు 29, 2024

ప్రణాళికతో చదివితే.. పదిలో విజయం

విద్యార్థులకు విషయ నిపుణుల సలహాలు

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ జీపీఏను సాధించాలనే లక్ష్యంతో ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక తరగతులు, ట్యూషన్లు, హోంవర్క్‌లు వంటి వాటితో పుస్తకాల పురుగుల్లా మారుతున్నారు. అయితే కొందరికి పాఠ్యాంశాలపై సరైన ప్రణాళిక, పరీక్షలపై అవగాహన కొరవడటం వంటి వాటితో ఆందోళన చెందుతున్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో శ్రమిస్తూ కొంత ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పరీక్షలకు దాదాపు 6 నెలల సమయం ఉంది. ఈ క్రమంలో గణితం, సైన్స్ పరీక్షలకు సంబంధించి దృష్టి సారించాల్సిన అంశాలపై విషయ నిపుణులు 'న్యూస్‌టుడే'కు వివరించారు.



కరీంనగర్ సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

సంసిద్ధతతో గణితంలో మంచి మార్కులు

● గణితంలో ఉత్తమ జీపీఏ కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే నిత్యం గంటకుపైగా సమయాన్ని వెచ్చించాలి.

● ప్రతి అధ్యాయంలోని కీలక భావనలు, సూత్రాలను రోజూ పునశ్చరణ చేయాలి. ముఖ్య సూత్రాలను చార్ట్ రూపంలో తయారుచేసి ఇంట్లో అంటించుకోవాలి.

● గత ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలు తిరిగి పునరావృతం కావచ్చొటికే.. వాటి మాదిరిగా ఉన్న ప్రశ్నలను ఎక్కువగా సాధన చేయాలి. ఎస్‌ఈఆర్‌టీ వారి గణిత అభ్యాస దీపికల నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశమున్నందున వాటిపై దృష్టి పెట్టాలి. 10జీపీఏ సాధన కోసం అన్ని అధ్యాయాలపై పట్టు సాధించాలి.

● వ్యాసరూప ప్రశ్నలకు ఎక్కువ మార్కులు ఉన్నందున వాస్తవ సంఖ్యలు, బహుపదులు, నిరూపక రేఖాగణితం, సరూప త్రిభుజాలు, త్రికోణమితి, సాంఖ్యాక శాస్త్రం, సంభావ్యత అధ్యాయాలపై పట్టు సాధించాలి.

● సమితులు, సాంఖ్యాక శాస్త్రం, సంభావ్యత అధ్యాయాల అంశాలను అభ్యాసం చేయడం ద్వారా సులభంగా ఉత్తీర్ణులు కావచ్చు.

● వెన్ చిత్రాలు, వర్గ బహుపది, వృత్తమునకు స్పర్శరేఖలను గీయడం, సరూప త్రిభుజాల నిర్మాణాలు, ఓజీవ్ వక్రములను నిర్మించడాన్ని పలుమార్లు సాధన చేస్తే మంచి మార్కులు సాధ్యం.

● సమితులలో సమ్మేళనం, ఛేదనం, పూరకము, భేదం లాంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. పరీక్షల సన్నద్ధత కోసం వీలైనన్ని నమూనా ప్రశ్నపత్రాలను ప్రాక్టీసు చేయడం అలవాటు చేసుకోవాలి.

● పార్ట్-బి(ఆబ్జెక్టివ్) పేపర్‌లోని సమస్యలకు ప్రతి అధ్యాయం నుంచి కీలక అంశాలు, సూత్రాలు ప్రాక్టీసు చేయాలి. పాఠ్యపుస్తకంలోని అన్ని బిట్లు ప్రాక్టీసు చేయడం మరోవద్దు.



- మనోహర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, రిసోర్స్ పర్సన్, జడ్పీ ఉన్నత పాఠశాల, గోరింటాల

విభజించి చదివితే భౌతికశాస్త్రం సులభం..

● పరీక్షలకు దాదాపు 6 నెలల సమయం ఉంటుంతో.. భౌతిక శాస్త్రంలోని 12 అధ్యాయాలను విభజించుకుని చదివితే ఉత్తమ గ్రేడ్ సాధ్యం. విభజించుకునేటప్పుడు దగ్గరి సంబంధం గల పాఠాలను ఎంచుకోవాలి. ఉదాహరణకు మొదటి, 3వ పాఠంలోని భావనలు ఒకే విధంగా ఉంటాయి.

● ప్రతి పాఠంలోని ముఖ్యమైన సూత్రాలను నిత్యం సాధన చేయాలి. వాటిని ఒకే దగ్గర రాసి పెట్టుకుని.. సమస్యలను సాధన చేస్తూ ఉండాలి.

● కీలకమైన పటాలను తరచూ ప్రాక్టీసు చేస్తూ.. వాటి భావనలను నిజ జీవితంలో అన్వయించుకుంటూ చేయాలి. దీనివల్ల వాటిని విద్యార్థులు మరిచిపోరు.



-జయపాల్‌రెడ్డి, స్కూల్ అసిస్టెంట్(ఫిజిక్స్), ప్రభుత్వ ధన్గర్‌వాడి ఉన్నత పాఠశాల, కరీంనగర్

● పుస్తకంలోని టేబుల్స్‌ను శ్రద్ధగా పరిశీలించి వాటిపై ఇప్పటినుంచే పట్టు సాధించాలి. వీటి నుంచే సమాచార నైపుణ్యానికి సంబంధించిన ప్రశ్నలు రానున్నాయి.

● కాంతికి సంబంధించిన కిరణచిత్రాలు, ఆవర్తనం, నాభ్యాంతరం కనుగొనే ప్రయోగం, దృష్టి లోపాలకు సంబంధించిన వాటిపై ఎక్కువ దృష్టి పెట్టాలి.

● రసాయన శాస్త్రానికి సంబంధించి రోజువారీ జీవితంలో ఆమ్లాలు, లవణాలు, అనువర్తనాలను తెలుసుకుంటూ సాధన చేయాలి. ఆధునిక ఆవర్తన పట్టికను పూర్తిగా అర్థం చేసుకోవాలి.



జీవశాస్త్రాన్ని పూర్తిగా అర్థం చేసుకుంటేనే..

● జీవశాస్త్రంలోని పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకుని ప్రశ్నలకు సమాధానాలు సులభం. కీలక భావనలు, శాస్త్రీయ నామాలు, పటాల ప్రయోగాలను తరచూ సాధన చేస్తూ సొంత మాటల్లో రాసేలా సన్నద్ధం కావాలి.

● జీవశాస్త్రంలోని పోషణ, శ్వాసక్రియ, విసర్జన, నియంత్రణ వ్యవస్థ, ప్రత్యుత్పత్తి లాంటి పాఠ్యాంశాలు చదివేటప్పుడు.. ఆ ప్రక్రియ జీవులలో, మొక్కలలో, మానవునిలో ఎలా ఉంటుందనేది దానిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి. వాటిని సొంత మాటల్లో వివరించేలా సాధన చేయాలి.

● పర్యావరణం, సహజ వనరులు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశముంది. పర్యావరణ సమస్యలపై, సహజ వనరుల పొదుపుపై స్వతహాగా అవగాహన ఏర్పరచుకోవాలి.



-ఆంజనేయులు, స్కూల్ అసిస్టెంట్(జీవశాస్త్రం), జడ్పీ ఉన్నత పాఠశాల, జ్యోతినగర్

మానేరు తీరం.. అరుణ శోభితం

మధ్యమానేరు జలాశయ కట్ట కింద మానేరు వాగుపై శనివారం సాయంత్రం ఆకాశం ఎరుపు రంగులో కనువిందు చేసింది. ఇల్లంతకుంట మండలం లోని పొత్తూరు మానేరు వంతెన పైనుంచి డ్యాం కట్ట, మానేరువాగులో నీరు ఇలా కన్పించడంతో వాహనదారులు చూడడానికి ఆసక్తి చూపారు.

- న్యూస్‌టుడే, ఇల్లంతకుంట





కేసుల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత

6,172 కేసుల పరిష్కారం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: లోక్ అదాలత్‌ను కక్షిదారులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ కేసులకు సంబంధించిన 6,172 కేసులను పరిష్కరించారు. వీటి ద్వారా రూ.2,91,41,989ను రికవరి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాది ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేటలో రాష్ట్ర బృందం పరిశీలన

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం రంగంపేటలో శనివారం పంచాయతీరాజ్ శాఖ సంయుక్త కమిషనర్ శ్రీనివాస్ పర్యటించారు. రాజన్న సిరిసిల్ల పరిధిలోని రంగంపేట జిల్లా స్థాయిలో ఆరోగ్య పంచాయతీ విభాగంలో వంద మార్కులు సాధించింది. జాతీయ ఆరోగ్య పంచాయతీ అవార్డు కోసం జిల్లా నుంచి రంగంపేటను ఎంపిక చేయగా.. శనివారం రాష్ట్ర బృందం గ్రామాన్ని సందర్శించింది. వీధులు, మురుగు కాలువల నిర్వహణ, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం హెల్త్ క్యాంపులు, గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితులు, సాధారణ ప్రసవాలపై పంచాయతీరాజ్ ఉద్యోగులు, వైద్య సిబ్బంది వివరాలను ఆరా తీశారు. పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో వినోద్‌కుమార్, డిప్యూటీ సీఈవో గీత, ఎంపీడీవో రఘురాం, ఎంపీవో వాజీద్, ఆరోగ్య పర్యవేక్షకురాలు పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, ఏఎన్ఎంలు సుజాత, కీర్తి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ శాఖ సంయుక్త కమిషనర్ శ్రీనివాస్

ప్రశస్తతో ప్రయోజనం

● విద్యార్థుల మానసిక, శారీరక సమస్యలకు యాప్

● నమోదు వివరాల ప్రకారం చికిత్స

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో చాలా మంది శారీరక, మానసిక, ఇతర సమస్యలతో బాధపడుతుంటారు కానీ.. ఎక్కువ మంది విద్యార్థుల వైకల్యాలు కనిపించేలా ఉండవు. ఇలాంటి వారిని గుర్తించడానికి నూతన విద్యావిధానానికి అనుకూలంగా ఎన్‌సీఈఆర్‌టీ ప్రశస్త (ప్రీ అసెస్‌మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్) అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దీనిపై ఇప్పటికే జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 27 నుంచి జిల్లాలోని పాఠశాలల్లో సర్వే ప్రారంభమైంది.



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

జిల్లాలో ఇలా..

ప్రభుత్వ పాఠశాలలు	:	511
ప్రైవేటు పాఠశాలలు	:	121
విద్యార్థులు : సుమారు 83 వేల మంది		

నమోదు ఇలా..

● ప్రశస్త యాప్‌ను అందరు ఉపాధ్యాయులు తమ మొబైల్ ఫోన్‌లో ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

● యాప్‌లో ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

● పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాఠశాల మెయిల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి.

● ఇతర ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

● ఉపాధ్యాయులందరూ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న తర్వాత ప్రధానోపాధ్యాయులు రిజిస్ట్రేషన్‌ను ధ్రువీకరించాలి.

● ఆ తర్వాత విద్యార్థులను పరిశీలించి సర్వేను ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేస్తారు.

● సర్వే పూర్తయిన తర్వాత విద్యార్థుల వివరాలను గోప్యంగా ఉంచుతారు.

● మొదట ఉపాధ్యాయులు సర్వేను పూర్తి చేసిన తర్వాత స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ (ఐఈఆర్‌పీ) మరోసారి సర్వేను చేస్తారు.

సర్వేలో పరిశీలించే అంశాలు

★ విద్యార్థి ఎలా మాట్లాడుతున్నాడు?
★ సరిగా చదవగలుగుతున్నాడా?
★ ఎలా రాస్తున్నాడు?
★ హోం వర్క్ సరిగా చేస్తున్నాడా?
★ తరగతి గదిలో విద్యార్థి ప్రవర్తన.
★ ఉపాధ్యాయుడి సూచనలు పాటిస్తున్నాడా?
★ కాళ్లు, చేతులు, తల, పొడవు, పొట్టి, చేతి వేళ్లు, మొదలైన అవయవాలకు సంబంధించిన వివరాలు.
★ చూపు ఎలా ఉంది.. రంగులను గుర్తిస్తున్నాడా.. నల్లబల్ల సరిగా కనిపిస్తుందా.. గణిత చిహ్నాలను గుర్తిస్తున్నాడా? తదితర అంశాలకు సంబంధించిన ప్రశ్నలు సర్వేలో ఉంటాయి. విద్యార్థుల్లో ఉన్న వైకల్యాలను గుర్తించి దానికి తగిన దానికి తగిన చికిత్సను అందించనున్నారు.

అక్టోబర్ నాటికి పూర్తి



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. విద్యాశాఖ సూచించిన ప్రశ్నల ఆధారంగా యాప్‌లో విద్యార్థుల వైకల్యాలను నమోదు చేయాలి. ఈ సర్వేను ఉపాధ్యాయులు అక్టోబరు నెలాఖరులోగా పూర్తి చేయాలి. ఆ తర్వాత ఐఈఆర్‌పీలు సర్వేను పూర్తి చేసి గుర్తించిన వైకల్యాల ఆధారంగా వారికి సమీపంలోని ఆసుపత్రుల్లో చికిత్స అందుతుంది.

- సతీశ్‌కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్

వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, చెత్తా చెదారం ఇలా.. వివిధ ప్రాంతాల ఇబ్బందులను శనివారం 'ఈనాడు' నిర్వహించిన 'ఫోన్-ఇన్'లో ప్రజలు ఏకరవు పెట్టారు. ఆయా సమస్యలు విన్న సిరిసిల్ల పురపాలక సంఘం కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ సమాధానాలు ఇస్తూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. - న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)

ఈనాడు మిత్రోడు

? వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
- **(సలేంద్రి మధు, ఇప్పలపల్లి) (రమేశ్, పెద్దూర్) (అన్నపూర్ణ, శివనగర్) (శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్‌నగర్) (అరిపల్లి శ్రీనివాస్‌గౌడ్ పెద్దూర్)**

✔ వీధి దీపాలను తెప్పించాం. సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలో ఎక్కడెక్కడ అవసరమున్నాయో అన్ని చోట్ల ఏర్పాటు చేస్తాం. వారం రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది.

? సర్దాపూర్‌లో ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. గ్రామ పంచాయతీలో మైక్ సెట్ పనిచేయడం లేదు. - **ప్రశాంత్‌గౌడ్**

✔ పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరిస్తాం. మైక్ సెట్‌ను ఏర్పాటు చేస్తాం.

? ఎనిమిదో వార్డులో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. - **తిరుపతి, పెద్దూర్**

✔ పారిశుద్ధ్య సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేస్తాం.

? వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. సమస్యను పరిష్కరించాలి. - **ఆడెపు ప్రతిభ, 17వ వార్డు, సిరిసిల్ల**

✔ కుక్కల బెడదను తగ్గించేందుకు ఇప్పటికే తగిన చర్యలు చేపడుతున్నాం.

? సాయినగర్‌లో మురుగు కాలువల సమస్యలు పరిష్కరించాలి. వర్షమొస్తే కార్గిల్ లేక్‌లోని అదనపు నీరంతా వచ్చి రోడ్డుపై చేరుతోంది. - **అల్లాడి శ్రీనివాస్**

✔ మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. కార్గిల్ లేక్‌లోని అదనపు నీటిని మళ్లించేందుకు చర్యలు చేపడుతాం.

? సిరిసిల్ల పురపాలిక కార్యాలయం పక్కన ఆటో అడ్డా ఏర్పాటైంది. కార్యాలయానికి రాకపోకలకు ఇబ్బందవుతోంది.
- **రాపెల్లి వెంకటేశ్, శ్రీనగర్ కాలనీ**

✔ త్వరలోనే బాధ్యులకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

? బతుకమ్మ ఘాట్‌లో పారిశుద్ధ్యం లోపిస్తోంది. దీంతో ఉదయపు నడకకు వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- **సుమన్, సిరిసిల్ల**

✔ రైతుబజార్‌లో కుళ్లిపోయిన కూరగాయలను తెచ్చి బతుకమ్మ ఘాట్‌లో పారబోయొద్దని గతంలోనే హెచ్చరికలు జారీ చేశాం. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

రుద్రంగి, న్యూస్‌టుడే: అర్హులైన అందిరికీ ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో రుద్రంగిలో శనివారం ఏర్పాటు చేసిన 'మెగా ఉద్యోగ మేళా'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే 30 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టిందని.. జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేసిందని గుర్తుచేశారు. నియోజకవర్గంలో ప్రతి నాలుగో శనివారం ఉద్యోగ మేళా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మరోవైపు మేళాలో 12 కంపెనీలు పాల్గొని 50 మందికి నియామకపత్రాలు అందించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్ తెలిపారు.



రుద్రంగిలో స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేస్తున్న విప్ శ్రీనివాస్, తదితరులు

స్వచ్ఛత ముఖ్యం

రుద్రంగి: స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమని విప్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్, ఆగాఖాన్ ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం రుద్రంగిలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో విప్ పాల్గొన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ తీసి ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు. అనంతరం రుద్రంగి గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన సఫాయి మిత్ర కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులను విప్ సన్మానించారు.



ఎల్ఎండీకి వెళ్తున్న నీరు


కొనసాగుతున్న వరద

బోయినపల్లి, న్యూస్‌టుడే: రాజరాజేశ్వర జలాశయానికి (మధ్యమానేరు) ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయానికి 10,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. జలాశయం ఆరు గేట్ల నుంచి ఎల్ఎండీకి 8,880 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు (318 మీటర్లు) కాగా ప్రస్తుతం 26.45 టీఎంసీల (317.57 మీటర్లు) నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

తరుగు పేరిట కోత విధిస్తే కఠిన చర్యలు

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట కోత విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఇల్లంతకుంట సింగిల్‌విండో అధ్యక్షుడు రొండ్ల తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలా నియంతృత్వ ధోరణిని తమ ప్రభుత్వం అవలంబించదని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమం కోసం పని చేస్తున్నారని వివరించారు. రైతు రుణమాఫీకి రేషన్‌కార్డు లింక్ పెట్టవద్దని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా రైతు రుణమాఫీకి రేషన్‌కార్డుకు సంబంధం లేదన్నారు. రూ.12.80 లక్షలతో నిర్మించిన సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు, నాయకులు, రైతులు, సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఇల్లంతకుంటలో మహిళా శక్తి క్యాంటీన్‌తోపాటు తాళ్లపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. డీఆర్డీవో శేషాద్రి, సీడీపీవో ఉమారాణి, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త రోజు, పర్యవేక్షకురాలు చంద్రకళ, ఏపీఎమ్‌లు శ్రీనివాస్, వాణిశ్రీ, క్యాంటీన్ యజమాని స్వాతి కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో గుండె పదిలం



న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

● పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్న 36 ఏళ్ల యువకుడు అలసట, చెమటలు పట్టడం వల్ల నీరసంగా ఉండడంతో కరీంనగర్‌లోని వైద్య నిపుణులను సంప్రదించగా పరీక్షలు నిర్వహించి గుండె పోటుగా నిర్ధారించారు. అవసరమైన స్టంట్ వేయడంతో కోలుకున్నారు. ఆ యువకుడికి రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు లేకపోయినా గుండెపోటు రావడం ఆ కుటుంబాన్ని ఆందోళనకు గురి చేసింది.

● జగిత్యాలకు చెందిన 50 ఏళ్ల రైతు రోజూ వ్యవసాయ పనులు చేసుకుంటారు. ఆరోగ్యమైన జీవనం గడుపుతున్నారు. కరీంనగర్‌లోని తన కుమారుడి వద్దకు వచ్చినప్పుడు సాధారణ వైద్య పరీక్షలు చేయించగా గుండె సమస్య ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు.

పై రెండు ఉదాహరణలు చూస్తే ఒకరేమో యువకుడు నిత్యం శ్రమ చేస్తున్నవారు.. మరొకరు రోజూ పొలంలో చెమటోడ్చే రైతన్న.. ఇద్దరికీ దురలవాట్లు ఏమీ లేవు.. అయినా గుండె సంబంధిత సమస్యలు రావడం అందరూ ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేస్తోంది.. మారుతున్న జీవనశైలి ప్రభావమో.. ఇతర కారణాలో గాని గుండె సంబంధిత బాధితులు ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్నారు.. సకాలంలో స్పందించి వైద్యం చేయించుకున్నవారు ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటుండగా.. లక్షణాలు గుర్తించలేని వారు ప్రాణాలు కోల్పోతున్నారు..

● ఉమ్మడి జిల్లాలో రోజుకు 200 శస్త్రచికిత్సలు
● నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



మీకు తెలుసా?

● మధుమేహం, రక్తపోటు బాధితుల్లో 15 శాతం మందికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. రెండూ ఉంటే మరింత ఎక్కువ ప్రమాదం.
● అధిక బరువు ఉండటం.. శారీరక శ్రమ లేకపోవడం, ధూమపానం, మద్యం తాగడం, అధిక కొవ్వు పదార్థాలు, మసాలా వంటకాలు తినడం సమస్య తీవ్రతను పెంచుతాయి.
● ఒత్తిడికి ఎంత దూరంగా ఉంటే అంతమంచిది. సమతుల ఆహారం తీసుకోవడం, నిత్య వ్యాయామం చేసేవారు కూడా ఒత్తిడికి గురైతే గుండె సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

అసాంక్రమిక వ్యాధుల సర్వే (ఉమ్మడి జిల్లా) ప్రకారం..



● రక్తపోటు బాధితులు : **2,14,538** మంది
● మధుమేహం ఉన్నవారు : **1,13,218** మంది

లక్షణాలు



● తీవ్రమైన ఛాతి నొప్పి, వికారం, శరీరం అంతా చెమటలు పట్టడం ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడటం
● ఛాతిలో నొప్పి ప్రారంభమై ఎడమ చేతి, ఎడమ దవడ, కుడి చేతి వరకు లాగుతూ ఉంటాయి.
● నడిచేటప్పుడు ఛాతిలో నొప్పి వస్తూ అసౌకర్యంగా ఉంటే దానిని గుండెపోటుగా భావించాలి.
● గుండెలో సమస్య ఉంటే సాధారణం కంటే ఎక్కువగా కొట్టుకుంటుంది.

జాగ్రత్తలివి..



● ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి.
● సమతుల ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, మొలకలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.
● వేపుళ్లు, జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్, శీతల పానీయాలు తీసుకోవద్దు.
● ప్రతి రోజూ మీ శారీరక సామర్థ్యం మేరకు వ్యాయామం తప్పనిసరి. కనీసం 45 నిమిషాలపాటు నడక అయినా జీవనంలో భాగం చేసుకోవాలి.
● ఒత్తిడికి గురికావొద్దు. పనిని ప్రణాళికతో చేయడం ద్వారా చాలా ఒత్తిడి తగ్గించుకోవచ్చు. ధ్యానం, యోగా ద్వారా ఒత్తిడి దూరమవుతుంది.
● గుండెపోటు వచ్చినట్లు అనిపిస్తే ఆందోళన చెందొద్దు. బరువులు ఎత్తవద్దు. మానసికంగా ప్రశాంతంగా ఉంటూ వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లాలి.
● ఎవరైనా గుండెపోటుతో అకస్మాత్తుగా పడిపోయి స్పృహ కోల్పోతే వెంటనే ఛాతిపై రెండు చేతులు పెట్టి గట్టిగా నొక్కుతూ (సీపీఆర్) చేయాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి.
● 30 ఏళ్లు దాటిన వారు ఏటా సాధారణ వైద్య పరీక్షలు చేయించుకుంటే ఆరోగ్య సమస్యలు గుర్తించొచ్చు. - **డా.దినకర్, గుండె వైద్య నిపుణులు, కరీంనగర్**



ఉమ్మడి జిల్లాలో (గుండె వైద్య నిపుణులు ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల వివరాల ప్రకారం) ఇలా..

● నెలకు వివిధ ఆస్పత్రుల్లో చేరుతున్న గుండె సంబంధిత సమస్య బాధితులు : **1500**
● శస్త్రచికిత్సలు చేసుకుంటున్నవారు : **200**
● గతేడాదితో పోలిస్తే పెరిగిన కేసులు : **10** నుంచి **15** శాతం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక విభాగం కరవు

ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నా గుండె సంబంధిత వైద్య నిపుణులు, ఈ విభాగానికి సంబంధించి ప్రత్యేక సౌకర్యాలు లేకపోవడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను, లేదంటే హైదరాబాద్ వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో గుండె సంబంధిత సమస్యల బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం బోధనాసుపత్రుల్లో గుండె వైద్య నిపుణులను నియమించాలని, ఆ విభాగాన్ని ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని జనం కోరుకుంటున్నారు.

తప్పుల తడకగా రెండో జాబితా

డీఎస్సీ-2008 బాధిత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి కరీంనగర్ జిల్లా 2008 డీఎస్సీ బాధిత అభ్యర్థులకు ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీ ఉద్యోగాల కల్పనకు జిల్లా విద్యాశాఖ చేపట్టిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం కొనసాగుతోంది. కరీంనగర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం పరిశీలన బృందం 67 మంది ధ్రువపత్రాలను పరిశీలించారు. వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. విద్యాశాఖ ప్రకటించిన జాబితాపై అయోమయం కొనసాగుతూనే ఉంది. మొదట 61 మందితో ప్రకటించిన జాబితాలో ఉద్యోగాలు చేస్తున్న వారి పేర్లు ప్రకటించారు. ఈ తప్పు తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ శుక్రవారం 186 మంది బాధిత అభ్యర్థులతో రెండో జాబితాను ప్రకటించి వారి ధ్రువపత్రాల పరిశీలనను ప్రారంభించింది.



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ బృందం

తొలగని అయోమయం...

రెండో జాబితా కూడా తప్పుల తడకగా ఉందని, ఉద్యోగాలు సాధించిన వారి పేర్లతో పాటు మెరిట్ జాబితాలో లేని వారి పేర్లు కొన్ని వచ్చాయని అభ్యర్థులు పేర్కొంటున్నారు. 2010లో జిల్లా విద్యాశాఖ ప్రకటించిన మెరిట్ జాబితాలో ఉద్యోగాలకు అర్హత సాధించిన 15 మంది పేర్లు కూడా రెండో జాబితాలో లేవని సంబంధిత అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. 2008 డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగాన్ని సాధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడి పేరు కూడా జాబితాలో ఉండటం గమనార్హం. బీసీ-ఈ కేటగిరీలో కూడా ఇతర విభాగం అభ్యర్థి పేరు ప్రకటించారని బాధితులు తెలిపారు. తమ గోడును వెళ్లబోసుకునేందుకు జిల్లా విద్యా శాఖ, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆ 15 మంది బాధితులు వాపోయారు. రెండో జాబితాలో తన పేరు లేదని బిల్లింగ్ సూపర్‌వైజర్‌గా [illegible] పైగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. హుస్నాబాద్ మండలం గండిపెల్లికి చెందిన [illegible] పేర్కొన్నారు. డీఎస్సీ [illegible] 16 ఏళ్లకు పైగా [illegible] వాటి కోసం ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. వాటి వివరాలు జిల్లా విద్యాశాఖ వద్ద ఉండటంతో పరిశీలనకు అనుమతించాలని సదరు అభ్యర్థులు కోరుతున్నారు. డీఎస్సీ అనంతరం అధికారులు ప్రకటించిన మెరిట్ జాబితాలో ఉన్న వారందరిని బాధిత అభ్యర్థుల జాబితాలో ప్రకటించి.. ధ్రువపత్రాల పరిశీలన అధికారులు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ అధికారులను కోరారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. [illegible] సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకుల మనస్సును [illegible] 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. [illegible] పండగ వేళ [illegible] ఆనందిస్తున్నారు. [illegible] రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలు పంచుకోవచ్చు పదండి.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి







రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీ పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు.. www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

స్తంభం తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన వందనం

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. సమస్యపై 'దీపాలు లేని విద్యుత్తు స్తంభం' శీర్షికన ఈ నెల 28న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సెస్ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్తు స్తంభాన్ని తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామైక్య సంఘంలో అవినీతి ఆరోపణలపై శనివారం జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, డీపీఎం పద్మయ్య విచారణ చేపట్టారు. మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై వివరాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ చాలాఏళ్ల క్రితం రుణాలు తీసుకున్న సభ్యులు బకాయిలు చెల్లింపులో జాప్యంతో ఆరోపణలకు దారి తీసిందన్నారు. ఐకేపీ కేంద్రాల నిర్వహణ, ఖర్చులపై ఆరా తీశామని చెప్పారు. మొండి బకాయిలు చెల్లింపులు గ్రామ స్థాయిలో కమిటీ వేశామన్నారు. ఆయా వ్యక్తులకు నోటీసులు జారీ చేసి రికవరీకి చర్యలు చేపట్టామని చెప్పారు. అక్టోబర్ 4న పొదుపు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నర్సయ్య, ఆడిట్ అధికారి హరికృష్ణ, సిబ్బంది అభినందన్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళం


ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి దాత కుటుంబ సభ్యులు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి నిత్యాన్నదాన సత్రానికి హైదరాబాద్‌కు చెందిన కంది భట్ల మార్కండేయశర్మ - జయప్రద దంపతులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అంతకు ముందు వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి చెక్కును అందజేశారు.

బతుకమ్మ పాట చిత్రీకరణ


చిత్రీకరణలో భాగంగా బతుకమ్మ పేర్చుతున్న మహిళలు

రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శనివారం బతుకమ్మ పాట సన్నివేశాలను చిత్రీకరించారు. మాజీ సర్పంచి రామ భీమేశ్వర్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఇల్లెందుల గీతాంజలి, స్థానిక నాయకులు రామ దామోదర్, చల్ల రాజు, వంగాల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీవో సవరించాలని డిమాండ్

రుద్రంగి: జీవో నంబర్ 25ను సవరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు బూర సదానందం డిమాండ్ చేశారు. రుద్రంగిలో శనివారం డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

ముస్తాబాద్: జీవో నం.25ను తక్షణమే సవరించాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో దీక్షలో, జాక్టో పిలుపు మేరకు గూడెం జడ్పీ పాఠశాల ఆవరణలో నిరసనలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట: బండలింగంపల్లిలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. టీటీపీఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) రాష్ట్ర కమిటీ సభ్యుడు మార్వాడి గంగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై విద్యార్థుల ర్యాలీ

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లను, చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ రెహానా, వైస్ ప్రిన్సిపల్ అనూష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.వాణిశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దీపాలు లేని స్తంభం

కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి ప్రజల సౌకర్యార్థం హైమాస్ట్ విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. గ్రామ శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రం, పల్లె ప్రకృతి వనం ఆవరణలో రెండింటిని ఏడాది క్రితం ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం వాటి విద్యుత్తు దీపాలు కనిపించడం లేదు. రాత్రి సమయంలో ఆ ప్రాంతమంతా చీకట్లు కమ్ముకుంటున్నాయని.. బతుకమ్మ, దసరా ఉత్సవాల దృష్ట్యా అధికారులు, పాలకులు స్పందించి హైమాస్ట్ దీపాలను అమర్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కోనరావుపేట



ఆదమరిస్తే ప్రమాదమే

కోనరావుపేట మండలం శివంగలపల్లిలో ప్రధాన రోడ్డులోని కల్వర్టు వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు గొయ్యి ఏర్పడింది. వాహనదారులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం బారిన పడాల్సిన పరిస్థితి. మండల కేంద్రానికి సమీపంలోనే ఉన్నా.. ఆయా శాఖల అధికారులు ప్రమాదకర గొయ్యి చూసినా మరమ్మతు చర్యలు తీసుకోవటం లేదని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కోనరావుపేట



539 కేసులు పరిష్కారం



కేసు పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి

వేములవాడ, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా వేములవాడ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 539 కేసులు పరిష్కారమయ్యాయని జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి తెలిపారు. 439 పిట్ కేసులను పరిష్కరించగా.. వంద కేసుల్లో రాజీ కుదిరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ఏపీపీ విక్రాంత్, సీనియర్ న్యాయవాదులు సత్యనారాయణగౌడ్, తిరుమల్‌గౌడ్, రజినీకాంత్, కిశోర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో తనిఖీలు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సిరిసిల్లలోని ఆర్డీవో కార్యాలయంలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన రేషన్ డీలర్ల నియామక ప్రక్రియలో పలు అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రభాకర్ నేతృత్వంలో ఈ నెల 26న తనిఖీలు నిర్వహించారు. వివరాల సేకరణకు ఆర్డీవో రమేశ్‌కుమార్ అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం ఆర్డీవోను పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సామూహిక సీమంతాలు

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలో శనివారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ జిందం కళ, ఏఎంసీ ఛైర్‌పర్సన్ స్వరూప, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రతి ఆసుపత్రులల్లో రోగులు, వైద్యుల భద్రతా దృష్ట్యా తప్పనిసరి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి సూచించారు. శనివారం రాత్రి వేములవాడలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, నిర్వాహకులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పట్టణ సీఐ వీర ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

ముస్తాబాద్: నామాపూర్‌లో ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మీకోసం కార్యక్రమం నిర్వహించారు. సిరిసిల్ల గ్రామీణ సీఐ మొగిలి మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తే ప్రమాదాలు జరుగుతాయని, ప్రత్యామ్నాయం చూసుకోవాలన్నారు. ఆవునూర్‌కు చెందిన రైతు రోడ్డుపై ధాన్యం అరబోస్తే ఆయనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్యాన్సర్ రహిత జిల్లాకు కృషి చేయాలి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలు దినచర్యలో భాగంగా ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులను నివారించి క్యాన్సర్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకులు కేకే మహేందర్‌రెడ్డిలు కోరారు. శనివారం తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్‌లో జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్యాంపులో 168 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ శ్రీనివాస్, తెలంగాణ ఫోరం డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి, వైద్యులు చతుర్వేది, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలి అల్ఫ్రెడ్, ప్రోగ్రాం అధికారి నహీమ్ జహన్, వైద్యులు స్నేహ, రేఖ, దీప్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు

ప్రపంచ గుండె దినోత్సవం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ గుండె దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. వైద్యులు, పారామెడికల్, పొరుగుసేవలు, 108 వాహన సిబ్బంది 35 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ బాబు మాట్లాడుతూ గుండె జబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యార్థినికి చేయూత

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాకు చెందిన బదావత్ మధులత రెండు నెలల క్రితం ఐఐటీలో ప్రవేశం పొందింది. సామాజిక మాధ్యమాల ద్వారా బాలిక పరిస్థితి తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రభుత్వ సాయంగా రూ.1.75 లక్షలు అందజేశారు. రూ.2.17 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు కాగా.. ఆ చెక్కును శనివారం స్థానిక తహసీల్ కార్యాలయంలో మధుమిత తల్లికి ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ రాములు, వైస్ ఛైర్మన్ లక్ష్మణ్, ఆర్ఐ ప్రవీణ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వీర్నపల్లి తహసీల్ కార్యాలయంలో చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

వేములవాడ, న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలోని చేనేత పారిశ్రామిక సహకార సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో రైతన్నలు, నేతన్నలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. రాష్ట్రంలో త్రిఫ్ట్ ఫండ్ పథకంలో భాగంగా నేతన్నలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా రూ.90 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఈ సందర్భంగా త్రిఫ్ట్ ఫండ్ పథకంలో విడుదల చేసిన రూ.25 లక్షల బకాయిల ఉత్తర్వు దస్త్రాన్ని సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ సాగర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

వేములవాడ, న్యూస్‌టుడే: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రాత్రి వేములవాడలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో విప్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కిషన్, రాష్ట్ర నాయకుడు సిహెచ్ యాదగిరి, ఆయా మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో దంపతుల ఆత్మహత్యాయత్నం

భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం చేసుకోగా భర్త మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన సామల రమేశ్ (52) లావణ్య దంపతులకు ఒక కుమార్తె ఉంది. రమేశ్ పాలిస్టర్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఆయన గతంలో సిరిసిల్ల అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా పనిచేశారు. కొద్ది రోజులుగా భార్యాభర్తలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే పురుగు మందు తాగారు. కుటుంబ సభ్యులు వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే రమేశ్ మృతి చెందారు. లావణ్య ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఇంకా ఫిర్యాదు అందలేదని సీఐ కృష్ణ తెలిపారు.


రమేశ్

అంగన్‌వాడీ టీచర్ హఠాన్మరణం


శంకరమ్మ

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్‌కు చెందిన అంగన్‌వాడి టీచర్ గంగాపురం శంకరమ్మ (54) శనివారం అధికారులు నిర్వహించిన సమావేశానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి తక్షణ సాయం కింద ఆ కుటుంబానికి రూ.50 వేలు అందజేయాలని అధికారులను కోరగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం బాధిత కుటుంబానికి రూ.50 వేలు అందజేశారు.

డెంగీ లక్షణాలతో యువకుడి మృతి

రుద్రంగి, న్యూస్‌టుడే: రుద్రంగి మండలకేంద్రానికి చెందిన గుగ్గిళ్ల శ్రీనివాస్ (35) డెంగీ లక్షణాలతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయామని. . ప్రభుత్వం ఆదుకోవాలని భార్య సహన, కుమార్తె శ్రీచందన, కుమారుడు లోకేశ్ కోరారు.

డేకేర్ సెంటర్‌లో వృద్ధురాలు..

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వృద్ధుల డేకేర్ సెంటర్‌లో వేదాంతి పద్మావతి (87) వృద్ధాప్య కారణంగా శనివారం మృతిచెందారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన పద్మావతి ఆ గ్రామంలో బస్టాండులో తలదాచుకుంటుందనే విషయం తెలుసుకున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఒగ్గు బాలరాజుయాదవ్ గతేడాది ఎల్లారెడ్డిపేటలోని వృద్ధుల డేకేర్ సెంటర్‌లో చేర్పించారు. వృద్ధురాలు మృతిచెందిందనే విషయాన్ని డేకేర్ సెంటర్ సిబ్బంది బాలరాజు యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా నివాళులర్పించారు. మృతురాలి తాలూకు కుటుంబీకులకు సమాచారం అందించినట్లు డేకేర్ సెంటర్ కో ఆర్డినేటర్ మమత తెలిపారు.


పద్మావతి

సంక్షిప్తం

ఉపాధ్యాయులకు సన్మానం

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్ ఆదర్శ పాఠశాల నుంచి ఒకేసారి 17 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిన విషయం విదితమే. వారికి వీడ్కోలు పలుకుతూ కొత్తగా వచ్చిన వారికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు శనివారం వేడుక నిర్వహించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విక్కుర్తి నందిని, దూస మధు బదిలీపై వెళ్లగా శనివారం ఎల్ఎఫ్‌హెచ్ఎం వీణ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజుగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఈవోకు..

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారిగా నూతనంగా నియమితులైన గాలిపెల్లి కృష్ణహరిని శనివారం పలువురు సన్మానించారు. బీఎస్ఎన్ఎల్ టెలికాం అడ్వైజర్ పిట్ల శ్రీశైలం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, బండారి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుఃఖంతో వీడ్కోలు

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని వకుళ వేములవాడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు బదిలీ కాగా.. శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 14 ఏళ్లుగా ఆమె అక్కడే సేవలు అందించగా.. ఈ ప్రాంతంలో తన అనుబంధాన్ని గుర్తు చేస్తూ ఉపాధ్యాయిని భావోద్వేగానికి గురయ్యారు. దీంతో అక్కడే ఉన్న విద్యార్థులు, వారి తల్లులు కంటతడి పెట్టారు.

ఓటరు జాబితా ప్రదర్శన

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంతోపాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు తుది జాబితాను శనివారం అధికారులు ప్రదర్శించారు. ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలను ఈ నెల 22 నుంచి 27 వరకు పరిష్కరించి, తుది జాబితాను విడుదల చేశామని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో వరిపంట ధ్వంసం

మామిడిపల్లి (కోనరావుపేట): కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన మోకిడే శ్రీనివాస్‌కు చెందిన వరి పంటను అడవి పందులు శనివారం తెల్లవారుజామున ధ్వంసం చేశాయి. ఎకరంన్నర పైగా పంటను ధ్వంసం చేశాయని.. రూ.50 వేల పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. వ్యవసాయ, అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి ప్రభుత్వం పరిహారం అందించేలా కృషి చేయాలని కోరారు.

జిల్లా నూతన కార్యవర్గాలు

ముస్తాబాద్, న్యూస్‌టుడే: జిల్లా ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయ సంఘ నూతన కార్యవర్గాన్ని ముస్తాబాద్ మండల నామాపూర్ ఆదర్శ పాఠశాల ఆవరణలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండల్‌రెడ్డి (నామాపూర్) ఉపాధ్యక్షుడు పి.అంజయ్య (నామాపూర్), వర్కింగ్ ప్రెసిడెంట్ జి.అంజయ్య (ఇల్లంతకుంట), ప్రధాన కార్యదర్శి ఎన్.కిరణ్‌కుమార్ (నామాపూర్), కోశాధికారి వేముల మల్లయ్య (నామాపూర్), అసోసియేట్ ప్రెసిడెంట్లు వి.మల్లేశం (కోనరావుపేట), చంద్రశేఖర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మహాలక్ష్మి (నామాపూర్) తదితరులను ఎన్నుకున్నారు.

సిరిసిల్ల అర్బన్: జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రామగిరి కేదారేశ్వర్, ఉపాధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి ఎండీ నయిముద్దీన్, సంయుక్త కార్యదర్శి సతీశ్‌రెడ్డి, కోశాధికారి సీతా రామాంజనేయులు, శ్రీధర్‌లు ఎన్నికయ్యారు.

విద్యా సామగ్రి అందజేత

సిరిసిల్ల అర్బన్: చంద్రంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. అక్కినపల్లి నాగరాజు, శివజ్యోతి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రవి, శ్రీనివాస్, మధుసూదన్, అంజలి, హరితరాణి, రమ, పద్మ పాల్గొన్నారు.

దూషణలు సరికాదు

సిరిసిల్ల గ్రామీణం: సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో గతంలో భారాస ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని తీసుకొచ్చిందని భారాస నాయకుడు బొల్లి రామ్మోహన్ అన్నారు. శనివారం సిరిసిల్లలో ఆయన మాట్లాడుతూ విమర్శలు మాని.. సిరిసిల్ల నేతన్నలకు వచ్చే అయిదేళ్లలో ఏం చేస్తారో చెప్పాలని స్థానిక కాంగ్రెస్ నాయకులను డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో భారాస మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిపై తమ పార్టీ నాయకులు మాట్లాడితే దానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు.

'విమర్శించే స్థాయి లేదు'

ఎల్లారెడ్డిపేట: మాజీ మంత్రి కేటీఆర్ అబద్ధాలతో పబ్బం గడుపుతున్నారని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను విమర్శించే స్థాయి భారాస జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు లేదని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డిపేట మండలశాఖ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. స్థానికంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఇతర నాయకులతో కలిసి శనివారం ఆయన మాట్లాడారు.

భాజపా సభ్యత్వ నమోదు

మల్కాపూర్ (బోయినపల్లి): ప్రతి బూత్‌లో బూత్ అధ్యక్షుడు రెండు వందల సభ్యత్వాలు చేయించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ సూచించారు. మల్కాపూర్‌లో భాజపా సభ్యత్వ నమోదు శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, కనీస వేతనం రూ 26 వేలు చెల్లించి, కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ కోరారు. శనివారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా జాయింట్ సెక్రటరీ అన్నల్‌దాస్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తురాలికి పర్స్ అప్పగింత

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి శనివారం రాత్రి వచ్చిన ఓ భక్తురాలు పోగొట్టుకున్న పర్స్‌ను ఆలయ ఎస్‌పీఎఫ్ సిబ్బంది అప్పగించారు. క్యూలైన్ ప్రాంతంలో పడిపోయిన పర్స్‌ను వెతికి అందులోని రూ.6,300లతోపాటు రెండు ఏటీఎం కార్డులను భక్తురాలికి అందజేశారు.

పాడి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

చందుర్తి: మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన తర్రె లక్ష్మణ్‌కు చెందిన గేదె ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందింది. బాధిత కుటుంబానికి సెస్ ద్వారా రూ.80 వేలు మంజూరు కాగా శనివారం చందుర్తి సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్ అందజేశారు. సనుగుల పాక్స్ ఛైర్మన్ జలగం కిషన్ రావు, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు పెగ్గర్ల రమేశ్‌రావు, నాయకులు తప్పుల అశోక్, బత్తుల కమలాకర్, ముకుందరావు, అకుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

వీర్నపల్లి: వీర్నపల్లి మండల వ్యాప్తంగా శనివారం గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, ఏఎన్ఎంలు సుజాత, కీర్తి, మంజుల, ఇందిర తదితరులు పాల్గొన్నారు.